
ముంపునకు గురైన రాజానగరం హైస్కూల్ సెంటర్


రాజానగరం నూకాలమ్మ గుడి వద్ద ఏడీబీ రోడ్డుపై నీటి ప్రవాహం


నాలుగు అడుగుల తూరతో నిర్మించిన కల్వర్టు వద్ద ఆగిపోతున్న నీరు

# బొత్తుగా పట్టించుకోరేం!

**ఊరే నీరైంది.. దారి గోదారైంది.. ఒక పక్క జాతీయ, మరో పక్క రాష్ట్రీయ రహ'దారి' జలదిగ్బంధమైంది.. ఎన్నికల వేళ ఓటర్ల వద్దకు వచ్చే నేతలు ఈ వాటర్ కోసం పట్టించుకోక ప్రయాణం దినదినగండంలా మారింది.. విద్యాలయాలకు కేంద్రంగా ఉన్న రాజానగరంలో ఈ పరిస్థితిపై 'బొత్తు'గా పట్టించుకోక విమర్శలకు తావిస్తోంది. ఈ 'దారి'దాపుల్లోకి వెళ్ల లేక, ప్రత్యామ్నాయ దారిలేక జనానికి నరకం కనిపిస్తోంది. ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఈ సమస్యను పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి.**

- రాజానగరం ఊరంతా నీరే..
- జాతీయ, రాష్ట్ర రహదారులు జలమయం
- గ్రామంలో స్తంభించిన జనజీవనం
- కూటమి నేతలపై ప్రజల పెదవి విరుపు
- స్థానిక ఎన్నికల వేళ ప్రభుత్వంపై చీదరింపు


రాజానగరంలో జాతీయ రహదారి, ఏడీబీ రోడ్డు జంక్షన్ వద్ద వరద ఉధృతి

**రాజానగరం:** అల్పపీడనం.. ఆపై అర్పబ్.. ఇప్పుడు మురసు.. ఇలా తుపానులు విరుచుకుపడుతున్నాయి. వర్షాలు కుమ్మేస్తున్నాయి. గత పదిరోజులుగా వర్షాలు జనానికి నరకం చూపుతున్నాయి. ఇదిలా ఉంటే వర్షం పడిన ప్రతిసారీ రాజానగరం గోదారిని తలపిస్తోంది. రాజానగరంలోని రావుల చెరువు నిండడంతో కళింగల ద్వారా నీరు బయటకు వచ్చే తరుణంలో చెరువు గట్టుకు గండి పడకుండా ముందు జాగ్రత్తగా లాకు గేట్లను ఎత్తివేశారు. దీంతో ఈ నీరంతా ఊరిలోకి చేరుతోంది. అలాగే ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద నీటితో స్థానిక కొత్త కాలనీ, సుబ్బారావు కాలనీలతో పాటు జాతీయ రహదారి, ఏడీబీ రోడ్డు, ఓల్డ్ ఎన్‌హెచ్‌తో పాటు పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఇక్కడ మోకాలు లోతు నీరు చేరింది.

**ముంపు వచ్చేదిలా..**

రాజానగరంలో మూడు రోజుల్లో 180.1 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. గడిచిన 24 గంటలలోనే 105.6 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. దీంతో పాటు కానవరం, ఫరిజల్లిపేట గ్రామాల నుంచి ముంపు నీరు ఫరిజల్లిపేటలోని రంగరాయ చెరువు స్లూయిజ్ మీదుగా రాజానగరంలోని రావుల చెరువుకు చేరుకుంది. ఈ చెరువులో పొంగి పొర్లుతున్న నీరు కళింగల ద్వారా బయటకు పోటెత్తుతోంది. ఈ క్రమంలో చెరువు గట్టుకు గండి పడకుండా ముందు జాగ్రత్తగా లాకు గేట్లను ఎత్తివేశారు. మంగళవారం రాత్రి నుంచి వరద నీరు క్రమేపీ పెరుగుతూ దిగువ ప్రాంతాలను ముంచెత్తుతోంది. అధికారులు తాత్కాలిక పనులు చేపట్టినప్పటికీ బుధవారం రాత్రికి కూడా వరద నీటి ఉధృతి తగ్గలేదు.

**నేతలు పట్టించుకోక..**

ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరద నీరు దిగువకు వెళ్లేందుకు రాజానగరంలో సరైన మార్గాలు లేవు. వర్షాలు వస్తున్న ప్రతి సందర్భంలోనూ ఇదే సమస్య వస్తోంది. రోడ్లు ముంపు బారిన పడుతున్నాయి. జనం నరకం చూస్తున్నారు. ఏటా ఇదే పరిస్థితి నెలకొంటుంది. అయినా సమస్య శాశ్వత పరిష్కారానికి మాత్రం కూటమి ప్రజాప్రతినిధులు చొరవ చూపడం లేదు. ప్రస్తుతం ఎన్నికల వేళ వారికి ఇది చెంపపెట్టులా మారనుంది.

**ఇలా చేస్తే మేలు**

దశాబ్దాలుగా వేధిస్తున్న ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాల్సిన ఆవశ్యకత ఉంది. జాతీయ రహదారిపై కలవచర్ల జంక్షన్‌లో ఈ నీటి ప్రవాహానికి తగ్గట్టుగా కల్వర్టును నిర్మించాలి. అయితే రహదారి నిర్మించిన సమయంలో స్థానిక పెద్దలు ఎవరూ శ్రద్ధ తీసుకోకపోవడంతో ఎగువ నుంచి వచ్చే నీరు దిగువకు వెళ్లేందుకు ఒకే 4 అడుగుల వ్యాసంతో ఉన్న ఒకే ఒక తూరను వేశారు. దీంతో పైనుంచి వచ్చే నీటి ప్రవాహం ఇక్కడకు వచ్చేసరికి నిలిచిపోవడంతో వరద నీరు ఎగదన్ని, కాలనీలు, రోడ్లు ముంపునకు గురవుతున్నాయి. ఇక్కడ కనీసం నాలుగు తూరలు వేస్తే సమస్య పరిష్కారం అవుతోంది.

## కష్టాలు.. క'న్నీళ్లు'

రాజానగరంలోని జాతీయ రహదారి, ఏడీబీ రోడ్ల జంక్షన్లను వరద నీరు ముంచెత్తడంతో బస్సులు, లారీలు, బైకులు సైతం ముందుకు వెళ్లే పరిస్థితి లేదు. అక్కడ మోకాలు లోతు నీరు వస్తోంది. తీరా సాహసించి వెళ్తే వాహనాలు మొరాయిస్తున్నాయి. మంగళవారం రాత్రి కాకినాడ నుంచి హైదరాబాద్ వెళ్తున్న ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు రోడ్డు పక్కగా వెళ్తూ బురదలో ఇరుక్కుపోయింది. అందులో ప్రయాణికులను వెంటనే మరో బస్సులో ఎక్కించి గమ్యస్థానానికి తరలించారు. అలాగే ఏడీబీ రోడ్డు జంక్షన్, నూకాలమ్మ గుడి సెంటర్, ఎస్‌బీఐ రోడ్డు, టెలిఫోన్ ఎక్స్ఛేంజ్, సినిమా థియేటర్ ప్రాంతాలు ముంపులో చిక్కుకున్నాయి. ఈ నేపథ్యంలో జగ్గంపేట, రాజమహేంద్రవరం, కాకినాడ వైపు రాకపోకలు సాగించేందుకు ప్రయాణికులు నరకం చూస్తున్నారు. జాతీయ రహదారిపై కలచవర్ల జంక్షన్‌లో గంటల తరబడి ట్రాఫిక్ నిలిచిపోతోంది. రాజానగరంలో ముంపునకు గురైన ప్రాంతాలను తహసీల్దార్ దివ్యభారతి పరిశీలించారు. జాతీయ రహదారిపై వేసిన తూర సామర్థ్యం సరిపోక తరచూ ఈ సమస్య తలెత్తుతోందని అన్నారు. ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు సంబంధిత అధికారులతో మాట్లాడతామన్నారు.

## క్లుప్తంగా

### జాతీయ ఫుట్‌బాల్ పోటీలకు జగ్బంధ్



**అడ్డతీగల:** వేటమామిడి బేస్ స్కూల్ విద్యార్థి గొల్లోరి జగ్బంధ్ అండర్-14 విభాగంలో రాష్ట్ర ఫుట్‌బాల్ జట్టుకు ఎంపికయ్యాడు. ఈ నెలలో జరగనున్న జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో రాష్ట్రం తరపున ఆడనున్నారు. ఇప్పటికే బేస్ స్కూల్‌కు చెందిన పలువురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికై ప్రతిభను చాటారు. అండర్-17 బాలుర విభాగంలో వరుణ్ విన్సెంట్, చెదల విజయ రాష్ట్ర స్థాయికి ఎంపిక కాగా, అండర్-14 బాలికల విభాగంలో బిర్మో ఎస్తేరు ఎంపికైంది. బేస్ స్కూల్లో విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యమిస్తూ విద్యార్థుల శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు ప్రత్యేక ప్రోత్సాహం అందిస్తున్నామని ప్రిన్సిపాల్ మృదుహాసిని తెలిపారు.

### ఫ్లషింగ్ ఆపరేషన్ విజయవంతం


ఫ్లషింగ్ ఆపరేషన్‌ను ప్రారంభిస్తున్న డీఈ ఆనందబాబు

**ధవళేశ్వరం:** వరదల సీజన్ అనంతరం నిర్వహించే ఫ్లషింగ్ ఆపరేషన్‌ను బుధవారం ధవళేశ్వరం తూర్పు డెల్టా స్కవర్ స్లూయిజ్ వద్ద విజయవంతంగా నిర్వహించారు. ఇరిగేషన్ డీఈ కె.ఆనందబాబు ఉదయం గేట్ల స్విచ్ఛాన్ చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఒకేసారి స్కవర్ స్లూయిజ్ గేట్ల ద్వారా నీటిని విడుదల చేయడంతో గేట్ల వద్ద పేరుకుపోయిన మట్టి దిగువకు కొట్టుకుపోయింది. బుధవారం 11,530 క్యూసెక్కుల నీటిని ఫ్లషింగ్ ఆపరేషన్ ద్వారా దిగువకు విడుదల చేశారు. డీఈ ఆనందబాబు మాట్లాడుతూ రబీ సాగునీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా ఫ్లషింగ్ ఆపరేషన్‌ను నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటికే పశ్చిమ, మధ్య డెల్టా స్కవర్ స్లూయిజ్‌ల వద్ద నిర్వహించామని, ఇప్పుడు తూర్పు డెల్టా స్కవర్ స్లూయిజ్ వద్ద నిర్వహించిన ఆపరేషన్‌తో ఈ ప్రక్రియ పూర్తయ్యిందన్నారు.

### గజ వాహనంపై శ్రీవారు


వాడపల్లిలో జరుగుతున్న గజవాహన సేవ

**ఆత్రేయపురం:** వాడపల్లిలోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి స్వామివారిని రాజాధిరాజ అలంకరణతో గజవాహనంపై ఊరేగించారు. మేళతాళాలు, బ్యాండ్ వాయిద్యాలు, బాణసంచా కాల్పుల ఎంతో అద్భుతంగా ఈ కార్యక్రమం జరిగింది. బ్రహ్మోత్సవాల పూజలు, కైంకర్యాలలో దేవదాయశాఖ ఉప కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు దంపతులు పాల్గొని స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు.

### డ్రైనేజీలో చిక్కుకున్న ఆవు


కాట్రేనికోనలో ఆవును రక్షిస్తున్న యువకులు

**కాట్రేనికోన:** మండల కేంద్రమైన కాట్రేనికోనలో బుధవారం ఓ ఆవు డ్రైనేజీలో పడిపోయింది. సుమారు రెండు గంటల పాటు నరకయాతన అనుభవించింది. దీంతో కొందరు యువకులు సంఘటన స్థలానికి చేరుకొని రక్షణ చర్యలు చేపట్టారు. వంగా దుర్గ బాబు ఆధ్వర్యంలో ఆవును డ్రైనేజీ నుండి బయటకు తీశారు.

# అన్నవరంలో కార్తిక ఏర్పాట్లు

- భక్తులకు ఇబ్బంది లేకుండా వసతులు
- ఈవో సూర్యచక్రధరరావు


చక్రధరరావు, ఈఓ

**అన్నవరం:** కార్తిక మాసాన్ని పురస్కరించుకుని రత్నగిరిపై సత్యదేవుని దర్శనానికి వచ్చే భక్తులకు అన్ని వసతులు కల్పిస్తున్నట్టు అన్నవరం దేవస్థానం ఈఓ నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల పది నుంచి డిసెంబర్ ఎనిమిదో తేదీ వరకు కొనసాగనున్న కార్తిక మాసంలో రత్నగిరికి భారీ సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉందన్నారు. వారి కోసం చేసిన ఏర్పాట్లను ఆయన వివరించారు.

- కార్తిక మాసంలో శని, ఆది, సోమవారాలతో బాటు, దశమి, ఏకాదశి, క్షీరాబ్ధి ద్వాదశి, కార్తిక పౌర్ణమి తదితర 17 పర్వదినాల్లో స్వామివారి సన్నిధికి భారీ సంఖ్యలో భక్తులు విచ్చేసే అవకాశం ఉన్నందున తెల్లవారుజామున ఒంటి గంట నుంచే స్వామివారి వ్రతాలు, రెండు గంటల నుంచి స్వామివారి దర్శనానికి ఏర్పాట్లు చేస్తున్నారు. వ్రతాలు, దర్శనం టిక్కెట్లు, ప్రసాదాల విక్రయాలకు అదనంగా కౌంటర్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. కార్తిక మాసంలో పంపా నదిలో భక్తులు పుణ్యస్నానాలు చేస్తారు కావున ముందు జాగ్రత్తగా ఇద్దరు గజఈతగాళ్లను ఏర్పాటు చేయనున్నారు.
- నవంబర్ 21వ తేదీ సాయంత్రం 5.30 గంటల నుంచి పంపా నదిలో జరిగే తెప్పోత్సవానికి భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. గతేడాది మాదిరిగానే 20 మంది గజఈతగాళ్లు, తెప్పకు ఎస్కార్ట్‌గా రెండు బోట్లు నడపాలని నిర్ణయించారు.
- కార్తిక పౌర్ణిమ సందర్భంగా నవంబర్ 24న సత్యదేవుని గిరి ప్రదక్షణ ఉదయం ఎనిమిది గంటలకు పల్లకీతో, మధ్యాహ్నం రెండు గంటలకు సత్యరథంతో ప్రారంభమై సాయంత్రం ఆరు గంటలకు ముగుస్తుంది. అదే రోజు ఆరు గంటలకు పంపా నది వద్ద హారతులు, రాత్రి ఏడు గంటలకు తొలిపాంచా వద్ద జ్వాలాతోరణం నిర్వహిస్తారు. గిరిప్రదక్షణ రోడ్డుకు ఇరు వైపులా విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.
- కార్తిక మాసంలో చిన్నకార్లు, ఆటోలు మినహా మరే ఇతర పెద్ద వాహనాలను కొండమీదకు అనుమతించరు. పెద్ద వాహనాలను కళాశాల మైదానంలో నిలిపి వేసి, భక్తులు దేవస్థానం బస్సుల్లో కొండ మీదకు తరలించాలని నిర్ణయించారు.
- రత్నగిరి, సత్యగిరిపై సుమారు వెయ్యి కార్లు, మూడు వేల బైకులను నిలిపేందుకు పార్కింగ్ స్థలాలు సిద్ధం చేశారు. రత్నగిరిపై రెండు వేల మంది సేద తీరేందుకు వీలుగా రత్నగిరి డార్మెట్రీ, విష్ణుసదన్‌లోని 36 హాళ్లు, సీఆర్వో కార్యాలయం వద్ద ఒక డార్మెట్రీ అందుబాటులో ఉంచారు.

# వరదలో చిక్కి.. బస్సు అదుపు తప్పి..

- పోలింగ్ సిబ్బంది అవస్థలు
- గోపాలపురం, యెలిశెట్టివారిపాలెంలో ఘటనలు



గోపాలపురం డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్ద పోలింగ్ సిబ్బందిని ట్రాక్టర్‌లో తరలిస్తున్న పోలీసులు


గోపాలపురంలో పరిస్థితిని సమీక్షిస్తున్న కలెక్టర్ కీర్తి చేకూరి, జేసీ మేఘ స్వరూప్

**సాక్షి, రాజమహేంద్రవరం/దేవరపల్లి/కొత్తపేట:** తుపాను కారణంగా కురిసిన భారీ వర్షాలకు పోలింగ్ సిబ్బంది తీవ్ర అవస్థలు పడ్డారు. తూర్పుగోదావరి జిల్లా గోపాలపురంలోని పోలింగ్ సామగ్రి డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని వరద ముట్టుముట్టడంతో నీటిలో చిక్కుకుపోయారు. అలాగే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం బిళ్లకుర్రు పంచాయతీ యెలిశెట్టివారిపాలెంలో బస్సు రోడ్డు పక్కకు ఒరిగిపోవడంతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బయటపడ్డారు. వివరాల్లోకి వెళితే.. గోపాలపురంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయాన్ని జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించి సామగ్రి పంపిణీ కేంద్రంగా ఏర్పాటు చేశారు. కేంద్రంలో బుధవారం ఎన్నికల సిబ్బందికి సామగ్రి పంపిణీ చేపట్టారు. అయితే మధ్యాహ్నం కురిసిన భారీ వర్షానికి మార్కెట్ కమిటీ ఆవరణలోకి నీరు భారీగా చేరింది. దీంతో అక్కడికి చేరుకున్న అధికారులు, సిబ్బంది వరద నీటిలో చిక్కుకుపోయారు. సమాచారం అందిన వెంటనే జిల్లా యంత్రాంగం అప్రమత్తమై యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టింది. కలెక్టర్ కీర్తి చేకూరి, ఎస్పీ డి.నరసింహ కిషోర్, జాయింట్ కలెక్టర్ వై. మేఘ స్వరూప్ స్వయంగా క్షేత్రస్థాయికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. కలెక్టర్ ఆదేశాలమేరకు ఎస్‌డీఆర్ఎఫ్ అగ్నిమాపక శాఖ, పోలీస్ బృందాలు సమన్వయంతో సహాయక చర్యలు చేపట్టి వరద ప్రవాహంలో చిక్కుకున్న ఎన్నికల విధుల అధికారులు, సిబ్బందిని బయటకు తీసుకువచ్చి సురక్షిత ప్రాంతానికి తరలించారు.

**పోలింగ్ సిబ్బందికి తప్పిన ప్రమాదం**

కొత్తపేట మండల పరిధిలోని బిళ్లకుర్రు రూటు నంబర్ 2 పోలింగ్ సిబ్బందికి త్రుటిలో ప్రమాదం తప్పింది. గురువారం జరగనున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల పోలింగ్‌కు సంబంధించి కొత్తపేటలో డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి బస్సులో పోలింగ్ సామగ్రితో సిబ్బంది పయనమయ్యారు. బిళ్లకుర్రు పంచాయతీ పరిధి యెలిశెట్టివారిపాలెంలో పీఎస్‌ల సిబ్బందిని, సామగ్రిని దించిన ఆ బస్సు కాలువ గట్టున ఇతర పీఎస్‌లకు వెళుతుండగా డేగలవారిపాలెం వంతెన వద్ద అదుపు తప్పి ఒక పక్కకు ఒరిగిపోయింది. అప్రమత్తమైన డ్రైవర్ వెంటనే సిబ్బందిని దిగిపోవాలని చెప్పడంతో ఒక్కొక్కరు జాగ్రత్తగా కిందకు దిగారు. వెంటనే సమీపంలో ఉన్న స్థానికులు స్పందించి బస్సు చక్రాలు మరింత కిందకు దిగబడిపోకుండా రాళ్లు, దుంగలు పెట్టారు. అనంతరం మరో బస్సులో సిబ్బందిని, పోలింగ్ సామగ్రిని తరలించారు.



డేగలవారిపాలెం వంతెన వద్ద అదుపు తప్పి ఒరిగిపోయిన పోలింగ్ బస్సు

# రత్నగిరిపై సత్యదీక్షలు ప్రారంభం



రత్నగిరిపై సత్యదీక్ష పీఠం వద్ద పూజలు చేస్తున్న పండితులు, మాలధారులు

**అన్నవరం:** సత్యదేవుని జన్మనక్షత్రం మఖ సందర్భంగా బుధవారం రత్నగిరిపై సత్యదీక్షలు ప్రారంభమయ్యాయి. సత్యదేవుని ఆలయం వద్ద, కొండ దిగువన నేరేళ్లమ్మ, వినాయకుని ఆలయాల వద్ద సుమారు 200 మంది భక్తులు ఈ దీక్ష చేపట్టారు. తెలంగాణలోని నల్గొండ, ఖమ్మం తదితర ప్రాంతాలకు చెందిన భక్తులు కూడా వీరిలో ఉండడం విశేషం. అలాగే జగ్గంపేట నియోజకవర్గంలో, అడ్డతీగలలో మరో 400 మంది గిరిజనులు దీక్ష చేపట్టినట్టు దేవస్థానం అధికారులు తెలిపారు. వీరంతా 27 రోజుల పాటు దీక్ష కొనసాగించి డిసెంబర్ ఒకటో తేదీన సత్యదేవుని జన్మనక్షత్రం మఖ నాడు స్వామివారి సన్నిధిలో విరమిస్తారన్నారు. 18 రోజుల దీక్ష చేపట్టే భక్తులు ఈ నెల 13 నుంచి, తొమ్మిది రోజుల దీక్ష చేపట్టే భక్తులు ఈ నెల 22 నుంచి మాలధారణ చేయాలని, అందరూ డిసెంబర్ ఒకటిన దీక్ష విరమించాలన్నారు.

**స్వామివారికి పూజలు**

సత్యదీక్షలు ప్రారంభమైన సందర్భంగా స్వామివారి వార్షిక కల్యాణ మండపం వద్ద సత్యదీక్ష ఏర్పాటు చేసి సత్యదేవుడు, అమ్మవారికి పండితులు ప్రత్యేక పూజలు చేశారు. సత్యదీక్ష విరమణ జరిగే వరకు ప్రతి రోజు ఉదయం, సాయంత్రం ఇక్కడ స్వామి, అమ్మవారికి పూజలు చేయనున్నారు. ఇంటి వద్ద పీఠం పెట్టే అవకాశం లేని స్వాములు ఇక్కడ జరిగే పూజల్లో పాల్గొనవచ్చని దేవస్తానం తెలిపారు.

# రాష్ట్ర స్థాయి వైద్యాధికారుల బృందం పర్యటన


రాజమహేంద్రవరం పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలిస్తున్న వైద్యాధికారులు

**కంబాలచెరువు (రాజమహేంద్రవరం):** రాష్ట్ర సమీక్ష మిషన్ పర్యటనలో రాష్ట్ర స్థాయి వైద్యాధికారుల బృందం మంగళవారం జిల్లాలో పర్యటించింది. ఈ బృందంలో ఎన్‌టీఈపీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ టి.రమేష్, ఆర్‌కేఎస్‌కే ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ వీవీ సుబ్రహ్మణ్యం, కన్సల్టెంట్ క్యూఏ ఎస్.వినోద్ కుమార్, కన్సల్టెంట్ ఎన్‌ఎల్‌ఈపీ కుంచ సత్యవతి ఉన్నారు. వీరందరూ జిల్లాలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ఏరియా ఆసుపత్రులు, జిల్లా ఆసుపత్రులను సందర్శించారు. అక్కడ ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలు, ఆరోగ్య కార్యక్రమాల అమలు తీరు, అందుబాటులో ఉన్న వైద్య సదుపాయాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. దీనిలో భాగంగా కడియం కమ్యూనిటీ హెల్త్ సెంటర్, అనపర్తి ఏరియా ఆసుపత్రితో పాటు ధవళేశ్వరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, భూపాలపట్నం హెల్త్ వెల్‌నెస్ సెంటర్, కంబాలపేట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, డైస్ సెంటర్, రాజమహేంద్రవరం ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి (జీజీహెచ్)లను పరిశీలించారు. ఈ పర్యటనలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి.కోమల, డీసీహెచ్ఎస్ డాక్టర్ పద్మావతి, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ టీవీ.చలపతిరావు, ఏ సీడీ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ హరిచంద్ర ప్రసాద్, డీపీఎంఓ డాక్టర్ శ్రీవల్లి తదితరులు పాల్గొన్నారు.

## బాల్య వివాహం నిలుపుదల

**పిఠాపురం:** గొల్లప్రోలులో నిర్వహించ తలపెట్టిన ఓ బాల్య వివాహాన్ని బుధవారం ఐసీడీఎస్, బాలల పరిరక్షణ విభాగం, అధికారులు, పోలీసులు అడ్డుకున్నారు. అక్కడ 12 ఏళ్ల బాలికకు వివాహం జరిపించడానికి ఏర్పాట్లు చేస్తున్నారనే సమాచారంతో అధికారులు ఆ ఇంటికి వెళ్లారు. బాలిక తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. బాల్య వివాహ నిరోధక చట్టం-2006, పోక్సో చట్టంలోని నిబంధనలు, వాటి ఉల్లంఘనకు పాల్పడితే తీసుకునే చట్టపరమైన చర్యలను వివరించారు. బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలను తెలిపారు. దీంతో బాలిక కుటుంబ సభ్యులు వివాహ ప్రయత్నాలను విరమించుకుంటామని, బాలిక చదువును కొనసాగిస్తామని అంగీకరించారు. ఈ మేరకు వారి నుంచి బాల్య వివాహ నిలుపుదల అంగీకార పత్రాన్ని తీసుకున్నారు. కార్యక్రమంలో పిఠాపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ సీహెచ్ దుర్గాదేవి, జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ బి.దుర్గారాణి, ఐసీడీఎస్ సూపర్ వైజర్ మానసాదేవి, సీఏ జీవీవీ సత్యనారాయణ, ఎస్సై ఎన్.రామకృష్ణ పాల్గొన్నారు.

# ముగిసిన సౌత్ జోన్ హాకీ పోటీలు



కోకనాడ కోస్టల్ స్పోర్ట్స్ క్లబ్ జట్టుకు ట్రోఫీ అందిస్తున్న ప్రముఖులు

**నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ):** హాకీ ఇండియా సహకారంతో కాకినాడ కోస్టల్ స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో జరుగుతున్న అస్మిత సౌత్ జోన్ హాకీ పోటీలు బుధవారం ముగిశాయి. ఫైనల్స్‌లో జూనియర్స్ విభాగంలో కోకనాడ కోస్టల్ స్పోర్ట్స్ క్లబ్ విజయం సాధించింది. సబ్ జూనియర్స్ విభాగంలో అర్జీటీ అనంతపురం జట్టు కప్ అందుకుంది. కోకనాడ జట్టు కెప్టెన్ అంకితకు టోర్నమెంట్ బెస్ట్ ప్లేయర్ అవార్డు లభించింది. జూనియర్స్ విభాగంలో కేరళ ద్వితీయ, నైట్ రైడర్స్ తృతీయ స్థానాలను సాధించాయి. సబ్ జూనియర్స్ విభాగంలో కేరళ రెండు, కోకనాడ కోస్టల్ స్పోర్ట్స్ క్లబ్ మూడో స్థానంలో నిలిచాయి. టోర్నమెంట్ చీఫ్ ప్యాట్రన్ కర్రి పద్మశ్రీ, గిరిజన క్రీడాభివృద్ధి అధికారి ఎస్‌వీ రమణ, లయన్స్ జిల్లా గవర్నర్ చిట్నీడి శ్రీనివాస్ తదితరులు విజేతలకు పతకాలు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో కోకనాడ కోస్టల్ స్పోర్ట్స్ క్లబ్ వ్యవస్థాపకుడు కె.రవిచంద్ర, టోర్నమెంట్ కమిటీ ప్రతినిధులు సుధారాణి, రజిని, దీప్తి ఎస్తేర్, బాబ్జీ, సూరిబాబు, సురేష్‌రాజు, హరిబాబు పాల్గొన్నారు.

## తన ఓటూ తనకు పడలేదాయె!

**తుని రూరల్:** ఆమెకు ఒక్క ఓటూ పడలేదు.. అలాగని అంటే జనం ఓట్లు అనుకునేరు! చివరకు ఆమె ఓటు కూడా ఆమెకు పడలేదు. ఈ విచిత్రం తుని మున్సిపల్ ఎన్నికల్లో చోటు చేసుకుంది. ఇక్కడ స్థానిక 27వ వార్డు నుంచి ముగ్గురు అభ్యర్థులు బరిలో నిలిచారు. స్వతంత్ర అభ్యర్థిగా పులి లక్ష్మి పోటీ చేశారు. వైఎస్సార్ సీపీకి 299, టీడీపీకి 389, నోటాకు 8 ఓట్లు పోలవగా, పులి లక్ష్మికి ఒక్క ఓటు కూడా పోల్ కాలేదు. దీంతో, ఇండిపెండెంట్‌గా పోటీ చేసినప్పటికీ ఆమె తన ఓటును మరొకరికి వేసినట్టు స్పష్టమవుతోంది. తన ఓటు కూడా తనకు వేసుకోని అభ్యర్థిగా ఆమె నిలవడం విశేషం.


**బ్యాంక్ ఆఫ్ బరోడా** Bank of Baroda

ROSARB - రాజమండ్రి
5వ అంతస్తు, 36-7-14, కొండూరి స్క్వేర్, ఇన్నీస్‌పేట, రాజమండ్రి-533102.
ఫోన్: 0883-2490509, Email: sarrjy@bankofbaroda.com

**స్థిరాస్తుల విక్రయం కొరకు అమ్మకం నోటీసు** అనుబంధం-IV-A (రూల్ 6(2) & 8(6) చూడవలెను)

(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్, 2002 యొక్క రూల్ 6(2) & 8(6)లోని నిబంధనలతో చదువుతూ సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకము కొరకు ఈ-వేలం అమ్మకం ప్రకటన)

ఇందుమూలముగా సాధారణ ప్రజానీకానికి మరియు ప్రత్యేకంగా ఋణగ్రహీత(లు), తనఖాదారు(లు) మరియు హామీదారు(లు) కు తెలియజేయునది ఏమనగా ఈ దిగువ వివరించబడిన స్థిరాస్తి సెక్యూర్డ్ క్రెడిటార్ గారికి తనఖా / ఛార్జ్ చేయబడి **బ్యాంక్ ఆఫ్ బరోడా** యొక్క అధీకృత అధికారిచే (సెక్యూర్డ్ క్రెడిటార్) స్వాధీనము చేసుకొనబడి ఈ దిగువ చెప్పబడిన ఖాతా(లు) యొక్క మొత్తములు తిరిగి వసూలు చేసికొనుటకు సదరు స్థిరాస్తులను **"ఎక్కడ ఏది ఉన్నదో", "అది ఎలా ఉన్నదో అలా", "అక్కడ ఏది ఉంటే అది"** ప్రాతిపదికన అమ్మకం జరుపబడును. ఋణగ్రహీత(లు)/ తనఖాదారు(లు)/హామీదారు(లు)/ సెక్యూర్డ్ అస్సెట్స్/లు/బకాయిలు/రిజర్వ్ ధర /ఈ-వేలం తేదీ & సమయం, ధరావత్తు మరియు బిడ్ పెంపుదల మొత్తం వివరాలు ఈ దిగువ పేర్కొనబడినవి.

| ఋణగ్రహీతలు / తనఖాదారులు / హామీదారుల పేర్లు మరియు చిరునామా | స్థిరాస్తి యొక్క వివరములు | బకాయిమొత్తం | రిజర్వుధర, ధరావత్తు & బిడ్ పెంపుదల | స్వాధీనం యొక్క స్వభావము నిర్మాణాత్మకం / భౌతికం |
|---|---|---|---|---|
| 1) **శ్రీ చోడిశెట్టి గిరీష్, (ఋణగ్రహీత) తండ్రి: సిహెచ్. వెంకటరావు,** డి.నెం.6-6-35, వార్డు నెం.22, ఆచంట వారి వీధి, పాత బజారు, మెయిన్ రోడ్డు, తుని, కాకినాడ జిల్లా, ఆంధ్రప్రదేశ్-533401.<br>2) **శ్రీమతి చోడిశెట్టి ప్రతిభ, (సహ-ఋణగ్రహీత) భర్త: చోడిశెట్టి గిరీష్,** డి.నెం. 6-6-35, వార్డు న